క్లుప్తంగా

పీఎం స్వానిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

చీమకుర్తి: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం స్వానిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య కోరారు. సోమవారం చీమకుర్తిలోని పీఎం స్వానిధి లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రుణాల అందజేతపై అవగాహన కల్పించారు. చిరువ్యాపారాలు చేసుకునే వారికి తొలివిడతగా రూ.10 వేలు, రెండో విడతగా రూ.20 వేలు, మూడో విడతగా రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా మొదటి విడతలో 942 మందికి, రెండో విడతలో 221 మందికి, మూడో విడతలో 38 మందికి రుణాలందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది చిరంజీవి, స్థానిక ఆర్‌పీలు పాల్గొన్నారు.

సమయపాలన మాసోత్సవాలను విజయవంతం చేయాలి

ఒంగోలు టౌన్: ఏపీఎస్‌ఆర్టీసీ మెరుగైన సేవల కోసం నెల రోజుల పాటు డిసెంబర్ 15 వరకు సమయపాలన మాసోత్సవాలు నిర్వహిస్తోందని ఒంగోలు డిపో మేనేజర్ ధర్మవరపు శ్రీనివాసరావు తెలిపారు. సమయానికి బస్ సర్వీసులను అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. కార్తీక మాసం సందర్భంగా పంచరామాలతో పాటు అరుణాచలంకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. ఎక్కువ సంఖ్యలో ట్రూప్‌గా వచ్చిన వారికి ప్రత్యేక సర్వీసులు నడుపుతామని తెలిపారు. ప్రజలు ఉపయోగించుకుని సమయపాలన మాసోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

● డీఈఓ కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న డీఈఓ కిరణ్‌కుమార్

ఒంగోలు సిటీ: ప్రతి విద్యార్థిలో కొంత ప్రతిభ దాగి ఉంటుందని, దానిని వెలికితీసి సరైన మార్గంలో నడపాల్సిన బాధ్యత గురువుల దేనని డీఈఓ కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం బండ్లమిట్ట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన కేరీర్ ఎడ్యుకేషన్ 8వ తరగతి ట్రైనింగ్ క్లాస్‌కు డీఈఓ హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఒక శిల లాంటివాడని, శిలలో దాగి ఉన్న శిల్పాన్ని బయటకు తీసి గొప్ప శిల్పంగా విద్యార్థులను మార్చాల్సిన బాధ్యత ఉందని అన్నారు. కేరీర్ ఎడ్యుకేషన్ ఫలాలు విద్యార్థులకు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవో రమేష్, కేరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం సీఈఓ రాక్వేల్ షరాఫ్, హెచ్‌ఎం జి.కృష్ణకుమారి, ఈఈ కేరీర్ ఎడ్యుకేషన్ సీనియర్ గైడ్ అనూష, 22 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చీమకుర్తి బాలికల హాస్టల్ భవనంలో పెచ్చులూడిపడుతున్న సీలింగ్


ఎప్పుడైనా ఊడిపడేలా ఉన్న శ్లాబు


మద్దిపాడు బీసీ హాస్టల్లో పెచ్చులూడిపడుతున్న శ్లాబు

ప్రభుత్వ హాస్టళ్లు.. నరకానికి నకళ్లు..!

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ఒకపక్క పైనుంచి శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. మరోపక్క కింది నుంచి గోడలు, పిల్లర్లు పగుళ్లిచ్చాయి. విద్యార్థులు కంటినిండా నిద్రపోదామంటే రక్షణ లేదు. కడుపునిండా తిందామంటే ముద్ద మింగుడు పడని నాసిరకం భోజనం. తాగడానికి పనికిరాని విధంగా మంచినీరు. ఆదివారం, పండుగల రోజు చికెన్ పెడితే ఒక్కో విద్యార్థికి గంటెలో ఒకేఒక్క ముక్క మాత్రమే.. ఇవన్నీ చీమకుర్తి బాలికల హాస్టల్లోని దయనీయ పరిస్థితులు. ఇక్కడే కాదు.. సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ ప్రభుత్వ హాస్టళ్లలో ఇదే దుస్థితి నెలకొంది. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్ల దుస్థితిపై హైకోర్టు సైతం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో హాస్టళ్లపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్...

- తాగునీరు, మరుగుదొడ్ల పరిస్థితి దారుణం
- మెనూ పాటిస్తున్నామంటూనే నాసిరకం భోజనం
- చికెన్ అంటే.. ఒక్కో విద్యార్థికి ఒకేఒక్క ముక్క
- శ్లాబ్ పెచ్చులూడిపడుతున్నా పట్టించుకునే వారు లేరు
- కనిపించని పరిశుభ్రత
- సంతనూతలపాడు నియోజకవర్గంలో అధ్వానంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు
- దయనీయ పరిస్థితులపై విద్యార్థుల గగ్గోలు

చీమకుర్తి/మద్దిపాడు/నాగులుప్పలపాడు/సంతనూతలపాడు: సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు, సంతనూతలపాడు మండలాల్లోని హాస్టళ్లు అధ్వానంగా ఉన్నాయి. కనీస వసతులు కరువై నిత్యం సమస్యలతో సతమతమవుతూ విద్యార్థులు నరకం చూస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు నెలలుగా హాస్టళ్ల గురించి, వాటిలో ఉంటున్న విద్యార్థుల సంక్షేమం గురించి ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం పర్యవేక్షించకుండా గాలికొదిలేయడంతో విద్యార్థుల గోడు వినే నాథుడే లేకుండా పోయాడు.

చీమకుర్తి బాలికల హాస్టల్లో దారుణ పరిస్థితులు...

చీమకుర్తి బాలికల హాస్టల్లో ఇచ్చేవి మజ్జిగో..మంచినీళ్లో తెలుసుకోవడానికి కాసేపు సమయం పడుతుందంటే అతిశయోక్తి కాదు. పోనీ.. మంచినీళ్లు తాగుదామంటే మురుగు కాలువ పక్కన అపరిశుభ్రంగా ఉన్న ట్యాప్ వద్దకు వెళ్లి పట్టుకోవాలి. కాలువలోని మురుగునీరు మంచినీటిలో కలుస్తున్నాయి. బాత్‌రూమ్‌లలో స్నానాలకు కూడా సమయపాలన పాటించాల్సిన పరిస్థితి. రాత్రి 8 గంటలు దాటితే నీళ్లు రాకుండా కుళాయిలు కట్ చేస్తున్నారు. మోటార్ ఆన్ చేయకుండా వాచ్‌మెన్‌లు, వంట మనుషులు విద్యార్థులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాటర్ ట్యాంక్‌ను ఏడాదికి ఒకసారి కూడా శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్రంగా కనిపిస్తోంది. మరుగుదొడ్ల వద్ద, ప్లేట్లు శుభ్రం చేసుకునే చోట కనీసం ఎప్పటికప్పుడు క్లీన్ చేయక దుర్వాసన వస్తోంది. హాస్టల్ ప్రాంగణంలో పెద్ద వేప చెట్లు ఉండటం వలన ఆ చెట్లపై నుంచి ఇటీవల పాములు జారి విద్యార్థులపై పడటంతో వారంతా హాస్టల్లో ఉండలేమంటూ వారి తల్లిదండ్రులకు మొరపెట్టుకున్నారు. 180 మంది విద్యార్థులకు 6 రూములే ఉండటంతో సర్దుకుని పడుకునేందుకు కూడా స్థలం లేని దౌర్భాగ్యపు స్థితి హాస్టల్లో నెలకొంది. ఈ సమస్యలన్నింటితో చీమకుర్తి బాలికల హాస్టల్లో ఉంటున్న విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కాకుండా ఉన్నాయి.


మద్దిపాడు ఎస్సీ హాస్టల్లో మరుగుదొడ్ల తలుపులకు రంధ్రాలు

కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ విజిట్ చేసినా మారని పరిస్థితులు...

చీమకుర్తి బాలికల హాస్టల్‌ను ప్రస్తుత జిల్లా కలెక్టర్ నెల రోజుల క్రితం సందర్శించారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఏడాది క్రితం హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న సదుపాయలు, భోజనాలు, మంచినీటి దుస్థితి గురించి వారికి విద్యార్థినులు వివరించారు. తగిన చర్యలు తీసుకుంటామంటూ హాస్టల్ సిబ్బందిని వారు హెచ్చరించినా పరిస్థితి మారలేదు. వారు వచ్చివెళ్లిన రెండు మూడు రోజులు మాత్రమే కొద్దోగొప్పో మార్పు చూపిస్తున్నారు తప్ప వారం రోజుల తర్వాత పరిస్థితి ఎప్పటిలాగే ఉంటోందని విద్యార్థినులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు విద్యార్థినులను హాస్టల్ సమస్యలు చెప్పనీయకుండా సిబ్బంది బెదిరింపులకు పాల్పడుతున్నారు. దాదాపు 180 మంది బాలికలు ఉన్న హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్ లేకపోవడం చూస్తుంటే.. ఆడపిల్లల పట్ల ఈ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అర్థమవుతోందని బాలికల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడో ఒంగోలు హాస్టల్‌లో పనిచేసే వార్డెన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తే.. ఆ వార్డెన్ వారానికొకసారి చుట్టపు చూపుగా వచ్చి స్థానికంగా ఉన్న వంట మనుషులు, వాచ్‌మెన్‌లకు పిల్లల బాధ్యతలు అప్పగించి మెనూ సరుకులు చాలీచాలకుండా ఇచ్చి వెళ్తున్నట్లు విద్యార్థినులు చెబుతున్నారు.

ఇతర హాస్టళ్లలోనూ సమస్యలు తిష్ట...

చీమకుర్తిలోని ఎస్సీ బాలుర హాస్టల్, గిరిజన బాలుర హాస్టల్, బీసీ బాలుర హాస్టళ్లలోనూ సమస్యలు తిష్ట వేశాయి. వాటిలో సురక్షిత తాగునీటి సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కలుషిత నీరు తాగుతూ వ్యాధులకు గురవుతున్నారు.


ఒంగోలులో సాంఘిక సంక్షేమశాఖ కళాశాల వసతి గృహం-2లో చెత్తాచెదారం

ఫ్యాన్లు లేని పోతవరం హాస్టల్...

నాగులుప్పలపాడు మండలంలోని పోతవరంలో ఉన్న బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో ఫ్యాన్లు కూడా లేకపోవడంతో విద్యార్థులు ఉక్కపోతతో నిద్రపట్టక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమ్మనబ్రోలు సాంఘిక సంక్షేమ వసతి గృహంలో మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు అవస్థ పడుతున్నారు. బీ నిడమానూరు గ్రామ వసతి గృహంలో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాటికి తలుపులు దెబ్బతినడంతో విద్యార్థులకు అసౌకర్యంగా ఉంది.

మద్దిపాడు బీసీ హాస్టల్లో మరుగుదొడ్ల తలుపులకు రంధ్రాలు...

మద్దిపాడులో ఒక బీసీ హాస్టల్, ఒక ఎస్సీ హాస్టల్ ఉండగా, బీసీ హాస్టల్లో మరుగుదొడ్ల తలుపులకు బిగించిన రేకులకు పెద్ద పెద్ద రంధ్రాలు పడి అధ్వానంగా ఉన్నాయి. హాస్టల్లో నిద్రించే సమయంలో పైన పెచ్చులూడి పడుతున్నాయని విద్యార్థులు తెలిపారు. బీసీ హాస్టల్లో మొత్తం 42 మంది విద్యార్థులు ఉంటుండగా, హాస్టల్ భవనం పాతది కావడంతో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయింది.


జిల్లా కేంద్రంలోనూ అధ్వానంగా హాస్టళ్లు...

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా కేంద్రమైన ఒంగోలులో సైతం ప్రభుత్వ వసతి గృహాలు అధ్వానంగా మురికికూపాలుగా దర్శనమిస్తున్నాయి. నగరంలోని కళాశాల వసతి గృహాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. వసతి గృహాల్లో కొద్దిసేపు ఉంటేనే దుర్గంధం భరించలేని పరిసితి. ఇక అక్కడే ఉండి చదువుకుంటున్న విద్యార్థుల వేదన వర్ణనాతీతం. ఒంగోలు అంజయ్య రోడ్డులోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం-2ను ప్రభుత్వ భవనంలో నిర్వహిస్తున్నారు. ఆరు మరుగుదొడ్లు ఉన్నా.. ఒక్కటీ ఉపయోగంలో లేదు. మరుగుదొడ్లలోని నీరు బయటకు వస్తోందని విద్యార్థులు తెలిపారు. చెంబు పట్టుకుని వసతి గృహం బయట, ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్తున్నారు. స్నానపు గదుల సంగతి ఇక చెప్పాల్సిన అవసరం లేదు. విద్యార్థులు ఆరు బయటే స్నానాలు చేస్తున్నారు. పాత భవనాలను తొలగించకపోవడంతో అక్కడ పందికొక్కులు, ఎలుకలు చేరి అనేక వ్యాధులకు కారణమవుతున్నాయి. ఈ వసతి గృహంలో దాదాపు 120 మంది విద్యార్థులు ఉంటున్నారు. మెనూ పాటిస్తున్న దాఖలాలే లేవు. సమయపాలన పాటించని వంటమనిషి, డైట్ చార్జీలు చెల్లించని ప్రభుత్వం తీరుతో వసతి గృహంలో దాదాపు గత 5 నెలలుగా మెనూ పాటించడం లేదు. వార్డెన్ పర్యవేక్షణ లేకపోవడంతో వంటమనిషి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. ఉదయం 9 గంటలకు కళాశాలకు వెళ్లాల్సి ఉండగా, 10 గంటలకు టిఫిన్ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ పాలు, గుడ్డు, వారంలో మూడు సార్లు చికెన్ వంటివి ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమయ్యాక తాము చూడలేదని విద్యార్థులు చెబుతున్నారు. కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో సబ్బులకు ఇబ్బంది పడుతున్నారు. ఒంగోలు ఇరిగేషన్ కార్యాలయ సమీపంలోని గిరిజన వసతి గృహంలో కనీసం మంచినీరు కూడా సక్రమంగా లేక విద్యార్థులు అవస్థపడుతున్నారు. వాడుక నీరు కూడా ఏరోజుకారోజు ట్యాంకర్ల ద్వారా సరఫరా అయితేనే విద్యార్థులు మొహం కడుగుతున్నారు. స్నానం చేయకుండానే కళాశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు, పాలకులు స్పందించి హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని, వసతులు మెరుగుపరచాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



చీమకుర్తి బాలికల హాస్టల్ భవనంలో కుప్పకూలేలా ఉన్న పిల్లర్, డేంజర్ బెల్ మోగిస్తున్న విద్యుత్ బోర్డు


అపరిశుభ్రంగా ప్లేట్లు కడిగే ప్రదేశం


ఏడాదికోసారి కూడా శుభ్రం చేయని వాటర్ ట్యాంకు


దుర్గంధం మధ్యలో మంచినీటి ట్యాప్

కరాటే పోటీల్లో ఒంగోలు విద్యార్థుల సత్తా

ఒంగోలు: స్పోర్ట్స్ కరాటే డు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ కప్-2024 చాంపియన్‌షిప్‌ను ఈ నెల 17వ తేదీ విజయవాడలోని రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించగా, ఒంగోలు విద్యార్థులు సత్తా చాటారు. 13 జిల్లాల నుంచి 800 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో ఒంగోలు నుంచి అండర్-69 కేజీల ఓపెన్ కుమితే విభాగంలో సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఒంగోలు డోజో (హైదరీ క్లబ్) నుంచి, పేర్నమిట్ట శ్రీ గురుదత్త విద్యాసంస్థల నుంచి 22 మంది విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారు. వీరిని సోమవారం శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్, సిద్దార్థ కరాటే అసోసియేషన్ చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, ప్రెసిడెంట్ మండవ మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి మండవ సుబ్బారావు, ఎస్‌కే ఏపీ ప్రెసిడెంట్ గుండవరపు రాఘవ, ఎస్కే ఏపీ వైస్ ప్రెసిడెంట్ మార్నెళ్ల సుబ్బారావు అభినందించారు. సి కోకాయ్ కరాటే ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ డైరెక్టర్ నల్లూరి మోహన్‌రావు ఆధ్వర్యంలో 160 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు.



పతకాలు అందుకుంటున్న ఒంగోలు విద్యార్థులు

గెలుపొందిన ఒంగోలు విద్యార్థులు వీరే...

బాలికల అండర్-11 కటా విభాగంలో గోపిక (సిల్వర్), కుమితే (బ్రాంజ్), అండర్-13 కటా విభాగంలో కే హిమజ్ఞ (గోల్డ్) , కుమితే విభాగంలో (బ్రాంజ్), అండర్-8 కటా విభాగంలో మోక్షిత (బ్రాంజ్), అండర్-11 కటా విభాగంలో నిహారిక (బ్రాంజ్), అండర్-10 కటా విభాగంలో శరణ్య (బ్రాంజ్), అండర్-10 కటా విభాగంలో మధులత సిల్వర్ మెడల్ సాధించారు.

పురుషులు...

అండర్-69 కేజీ ఓపెన్ కుమితే విభాగంలో యశ్వంత్ సిల్వర్ మెడల్ సాధించారు. ఇతను ఇటీవల సౌత్ ఇండియన్ చాంపియన్‌గా కూడా నిలిచారు. కియో నేషనల్ 6వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అండర్-16 కటా విభాగంలో సాయి మణికంఠ (బ్రాంజ్ మెడల్), అండర్-10 కటా విభాగంలో వేద అఖిల్ (గోల్డ్ మెడల్), కుమితే విభాగంలో (బ్రాంజ్ మెడల్) సాధించారు. అండర్-9 విభాగంలో టి.వరుణ్ తేజ కటా విభాగంలో బ్రాంజ్ మెడల్, అండర్-11 విభాగంలో నిఖిల్ సాయి (సిల్వర్ మెడల్), కుమితే విభాగంలో సిల్వర్ మెడల్, అండర్-15 కటా విభాగంలో దుర్గా మనోజ్ (బ్రాంజ్ మెడల్), అండర్-13 కటా విభాగంలో సీహెచ్ వర్ధన్‌రామ్ సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు.

మృతిచెందిన చిన్నారుల కుటుంబాలను ఆదుకోవాలి

ఒంగోలు సిటీ: రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కొప్పోలుకు చెందిన ముగ్గురు చిన్నారుల కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం ఒంగోలు నగర కమిటీ సోమవారం డిమాండ్ చేసింది. ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఇవ్వాలని సీపీఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, రమేష్, తదితరులు కోరారు.

భవిష్యత్ కమ్యూనిస్టులదే

నాగులుప్పలపాడు: రానున్న కాలం కమ్యూనిస్టులదేనని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాలా అంజయ్య అన్నారు. మండలంలోని అమ్మనబ్రోలులో సోమవారం సీపీఎం నాగులుప్పలపాడు మండల 7వ మహాసభ నిర్వహించగా, అంజయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచ దేశాల్లో కమ్యూనిస్టుల ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. మనదేశంలోనూ అదే జరగనుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్కే మాబు, తదితరులు పాల్గొని మాట్లాడారు.

నూతన కమిటీ ఎన్నిక...

మండల నూతన కార్యదర్శిగా శ్రీకాంత్, మరో 9 మందితో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జె.జయంతిబాబు, జి.బసవపున్నయ్య, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్


పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో ఎస్‌సీఏపీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రాంతాలను సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. పాత బైపాస్ రోడ్డులో డివైడర్, భాగ్యనగర్ 4వ లైనులో నూతన రోడ్డు నిర్మాణం, కిమ్స్ ఆస్పత్రి వద్ద గ్రీనరీ పనులకు సంబంధించిన ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఓఎంసీ కమిషనర్‌కు కలెక్టర్ సూచించారు. ఆమె వెంట ఆర్డీఓ సుశీల, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎంఈ చంద్రయ్య, డీఈఈ పద్మజ, తదితరులు ఉన్నారు.

● బంగారు బాలోత్సవంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి

బాల్యం నుంచే బంగారు భవిష్యత్తు

సంతనూతలపాడు: విద్యార్థులు బాల్యం నుంచే బంగారు భవిష్యత్తు వైపు పయనించాలని జెడ్పీ సీఈఓ చిరంజీవి ఆకాంక్షించారు. బంగారు బాలోత్సవం వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఎంఈవో వెంకారెడ్డి అధ్యక్షతన సంతనూతలపాడులోని ఎస్ఎస్‌కేసీఎం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వక్తృత్వం, వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్, లోగో డిజైన్, స్లోగన్ రైటింగ్ అంశాలలో పోటీలు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ యజమాన్యాల పాఠశాలల నుంచి 263 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాను బాల్య వివాహాలు లేని, బాలకార్మికులు లేని, బాలల అక్రమ రవాణా లేని జిల్లాగా తయారు చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. బాలల వాక్కుల పట్ల గౌరవ మర్యాదలు చూపే జిల్లాగా, బాలలందరూ బంగారు బాల్యాన్ని అనుభవించే జిల్లాగా తయారు చేయాలన్నారు.

పోటీల్లో విజేతలు వీరే...

వక్తృత్వంలో కే రిషిత, (ఎస్ఎస్‌కేసీఎం ఉన్నత పాఠశాల, సంతనూతలపాడు), వ్యాసరచనలో ఎం.సాగర్ చందు (ఏపీఆర్ఎస్, గంగవరం), డ్రాయింగ్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెయింటింగ్లో చిలకపాడు, కే అనూష (కొనగానివరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), లోగో డిజైన్లో ఎస్ నిస్సిజాయ్, షైనింగ్ స్టార్స్ (సంతనూతలపాడు), స్లోగన్ రైటింగ్లో సీహెచ్ నీలిమ (హనుమంతరావు హైస్కూల్, గంగవరం) విజేతలుగా నిలిచారు.


మద్దిపాడులో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వసుంధర

జెడ్పీ సీఈఓ చేతులమీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీమతి దుంపా రమణమ్మ, ఎంపీడీఓ డి.సురేష్‌బాబు, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంఈఓ డి.వెంకారెడ్డి, ఏపీఎం బాబూరావు, ఈవోపీఆర్డీ ఎంపీ రమణమ్మ, హైస్కూల్ హెచ్ఎం ప్రమోద, ఇతర మండల స్థాయి అధికారులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకత పెంపొందించుకోవాలి

● డీఆర్‌డీఏ పీడీ వసుంధర

మద్దిపాడు: విద్యార్థులు సృజనాత్మకత పెంపొందించుకోవాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ వసుంధర పిలుపునిచ్చారు. బంగారు బాలోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మండల స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.జ్యోతి, తహసీల్దార్ సుజన్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పాఠశాల హెచ్ఎం పెద్దిరెడ్డి కోటిరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు: బంగారు బాల్యం వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో విద్యార్థులకు మండల స్థాయిలో వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం, నినాదాలు, చిత్రకళ, లోగో వంటి పలు పోటీలు నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ కె.బేబీరాణి, ఎంపీడీఓ వై.మహాలక్ష్మి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పోటీలను పరిశీలించారు. మండల స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులు 19వ తేదీ జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు హాజరుకావాలని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఎంఈఓలు టి.రవి, ఈవీ రమణయ్య, పోటీల నిర్వాహకులైన ఉపాధ్యాయులు తిరుమల, శ్రీనివాసులు, ఆంజనేయులు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యంలోనే చైతన్యవంతులు కావాలి

కొత్తపట్నం: బాల్యంలోనే అన్ని రంగాల్లో చైతన్యవంతులైతే జీవితంలో ఉన్నతంగా స్థిరపడటమే కాకుండా ఎవరి చేతుల్లోనూ మోసపోకుండా జీవిస్తారని జిల్లా పంచాయతీరాజ్ అధికారి జీవీ నాయుడు అన్నారు. బంగారు బాల్యం-సదాబాలల సేవలు అనే కార్యక్రమాన్ని సోమవారం ఐదో రోజు స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. డీపీవో ముఖ్యఅతిథిగా పాల్గొనగా హెచ్ మన్నెం శ్రీదేవి అధ్యక్షత వహించారు. తహసీల్దార్ పిన్నింటి మధుసూదన్‌రావు, ఎంపీడీవో శ్రీకృష్ణ, ఎంఈవో 1, 2 తులసీకుమారి, పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, స్టాఫ్ సెక్రటరీ హరిబాబు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రైనింగ్ కమిషనర్ కొణిజేటి వెంకటశేషారావు, ఉపాధ్యాయులు, నేతాజీ స్కౌట్ విద్యార్థులు, బాలబాలికలు పాల్గొన్నారు.